సాక్షి
కర్నూలు
సోమవారం । 7 । అక్టోబర్ । 2024



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళావేదికపై ఆదివారం గుంటూరుకు చెందిన నటరాజ కళా కూచిపూడి డ్యాన్స్ అకాడమీ వారి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి ఆదివారం ఒంగోలుకు చెందిన వై.కృష్ణసుధాకర్ రూ.1,00,126 విరాళాన్ని అందజేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,632
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:14,662
అవుట్ ఫ్లో	:14,422

న్యూస్‌రీల్

రూ.2.26 కోట్లతో సీ.క్యాంపు రైతుబజారు విస్తరణ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు సీ.క్యాంపు రైతుబజార్‌ను రూ.2.26 కోట్లతో విస్తరించనున్నారు. ఇటు వినియోగదారుల నుంచి అటు రైతుల నుంచి ఆదరణ ఉండటంతో మార్కెటింగ్ శాఖ ఇంజినీరింగ్ విభాగం ప్రతిపాదనలు పంపింది. ఈ మేరకు అటు వైపు ఉన్న రెండు శిథిలమైన క్వాటర్లను రైతుబజారుకు స్వాధీనం చేశారు. విస్తరించే రైతుబజారులో రైతుల కోసం 60 స్టాళ్లు, 20 షాపులు, చిన్న క్యాంటీన్, టాయ్‌లెట్స్ బ్లాక్, విస్తరించే వైపునకు కాంపౌండ్ వాల్ నిర్మించనున్నారు. అయితే నిధులు విడుదల కావాల్సి ఉంది. కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేటులోని గోవర్ధన్‌నగర్‌లో నిర్మించిన రైతు బజారు ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దీనిని మంజూరు చేశారు. నిర్మాణపు పనులు పూర్తి కావడంతో మార్కెటింగ్ శాఖ ఏడీఎంకు అప్పగించనున్నారు. ఈ ప్రక్రియ ఈ వారంలో పూర్తి కానుంది. తర్వాత ప్రారంభించేందుకు మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి చర్యలు చేపట్టారు.

ఉప్పొంగిన వేదావతి



ఆంధ్ర-కర్ణాటక సరిహద్దులోని మార్లమడికి వద్ద వేదావతి వంతెనపై ప్రవహిస్తున్న నీరు

హాలహర్వి/హొళగుంద: కర్ణాటక ఎగువ ప్రాంతాల్లో ఆదివారం కురిసిన వర్షాలకు ఆంధ్ర సరిహద్దులోని వేదావతి నది ఉప్పొంగింది. హాలహర్వి, హొళగుంద మండలాల్లో నది పరీవాహక గ్రామాలైన గూళ్యం, జె.హొసళ్లి, బల్లూరు, అమృతాపురం, నాగరకణ్వీ, కోగిలతోట, మార్లమడికి గ్రామాల్లోని పంట పొలాలను వరద నీరు ముంచెత్తింది. కొందరి రైతుల విద్యుత్ మోటార్లు నీటిలో కొట్టుకుపోయాయి. చేతికొచ్చే సమయంలో పంట మునిగిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్లమడికి వద్ద ఉన్న వేదావతి వంతెనపై వరద నీటిలోనే వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వందవాగిలి, పెద్దహ్యాట, చిన్నహ్యాట తదితర గ్రామాల పరిధిలోని మిరప, పత్తి పొలాల్లో వర్షపు నీరు నిలిచాయి. పంటలు దెబ్బతింటుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

శ్రీశైలంకు 85,756 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి ఆదివారం సాయంత్రానికి జూరాల, సుంకేసుల నుంచి 85,756 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం జలాశయంలో 198.3623 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 881.90 అడుగులకు చేరుకుంది. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్టులకు 76,924 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కుడిగట్టు కేంద్రంలో 14.112 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 16.084 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగింది.

రుమటాలజీ వ్యాధులపై అవగాహన కల్పించాలి

కర్నూలు(హాస్పిటల్): రుమటాలజీ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఇండియన్ రుమటాలజీ అసోసియేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడిసిన్ కేఎంసీ, ఆధ్వర్యంలో కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చర్ గ్యాలరీలో ఆదివారం'రుమాలర్న్-2024' పేరుతో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆసుపత్రిలోని అన్ని విభాగాల ఆధ్వర్యంలో వైద్యసదస్సులు నిర్వహించి ఆయా విషయాల్లో వైద్యులకు అప్‌టుడేట్ నాలెడ్జ్ అందిస్తున్నట్లు తెలిపారు. తద్వారా ఆధునిక వైద్యసదుపాయాల గురించి వివరించి రోగులకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు ఉపయోగపడేలా చేస్తున్నామన్నారు. కర్నూలులో మొదటిసారిగా రుమటాలజీ వైద్యుల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం రుమటాలజీలో వివిధ సమస్యల గురించి డాక్టర్లు జి. అరవింద్, ఎం. విఘ్నేష్, ఎ. శ్రావణ్‌కుమార్, జి. మేఘన, కె. కిశోర్‌బాబు, ఎన్. కావ్యదేవి, పి. విజయప్రసన్న తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో అసోసియేషన్ డాక్టర్ ఐ. రాజేంద్రవరప్రసాద్, సభ్యులు డాక్టర్ రాజ్‌కిరణ్. డాక్టర్ పీఎస్ఆర్. గుప్త, డాక్టర్ దామోదరం, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ మహేశ్వరరెడ్డి, సెక్రటరీ డాక్టర్ సృజన పాల్గొన్నారు.




సదస్సులో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభాకరరెడ్డి

రెక్టిఫైడ్ స్పిరిట్‌తో మద్యం తయారీ యోచన

- ఇప్పటి వరకూ ఈఎన్‌ఏ బేస్డ్ లిక్కర్
- ఆర్ఎస్‌తో పోల్చితే ఈఎన్‌ఏ ద్వారా క్వాలిటీ మద్యం
- మందుబాబుల ఆరోగ్యంపై పెను ప్రభావం
- ఎక్కడికక్కడ 'సిండికేట్' అవుతున్న కూటమి నేతలు
- ఎమ్మార్పీపై రూ.20-30 అధిక ధరతో విక్రయాలు



నూతన మద్యం పాలసీ పేరిట ప్రభుత్వం మందుబాబుల ఆరోగ్యంతో చెలగాటం ఆడేందుకు సిద్ధమైంది. ధర తగ్గించినట్లు ప్రచారం చేసుకునేందుకు ఏకంగా 'చీప్' లిక్కర్‌ను తెరపైకి తీసుకొస్తుంది. ఇప్పటికే కూటమి నేతలకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చే దిశగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం.. ఇప్పుడు క్వాలిటీ విషయంలో మందుబాబుల పేగులు కాల్చేందుకూ సిద్ధమైంది. దశాబ్దాలుగా లిక్కర్ తయారీకి వినియోగిస్తున్న ఫార్ములాను కాదని.. కొత్త ఫార్ములాతో అనారోగ్యాన్ని మద్యం షాపుల్లోనే అంటగట్టేందుకు పావులు కదుపుతోంది.



చీప్ లిక్కర్!

సాక్షి ప్రతినిధి కర్నూలు: ప్రస్తుతం ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలు నడుస్తున్నాయి. నూతన పాలసీలో దుకాణాలను లాటరీ ద్వారా ప్రైవేటు వ్యక్తులకు కేటాయించి అమ్మకాలు జరపనున్నారు. అక్టోబర్ 12 నుంచి విక్రయాలు సాగుతాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని దుకాణాల్లో నెలకు 30-35 లక్షల కేసుల మద్యం విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో 'చీప్ లిక్కర్' ఎక్కువగా అమ్ముడుపోతుంది. రోజంతా శ్రమపడి రాత్రికి మందు సేవించాలనుకునే పేద వర్గాలు, వర్కర్లు ఎక్కువగా ఈ లిక్కర్‌నే సేవిస్తారు. వారికి వచ్చే రోజు కూలీలో ఇంటి ఖర్చులకు కొంత దాచుకుని, కొంత మొత్తంలో తక్కువ ధరకు లభించే చీప్ లిక్కర్‌ను కొనుగోలు చేస్తారు. గత ప్రభుత్వ హయాంలో చీప్‌లిక్కర్ క్వాటర్ (180 మిల్లీలీటర్లు) రూ.120-రూ.150 చొప్పున విక్రయించారు. ప్రస్తుత ప్రభుత్వం రూ.99కే క్వాటర్ అందిస్తామని ప్రకటించింది.

రూ.99కే క్వాలిటీ లేని మద్యం విక్రయిస్తారా?

లిక్కర్ తయారీకి రెండు రకాల స్పిరిట్‌ను వినియోగిస్తారు. ఒకటి ఆర్ఎస్ (రెక్టిఫైడ్ స్పిరిట్) బేస్డ్ లిక్కర్. రెండోది ఈఎన్‌ఏ (ఎక్స్ట్రా న్యూట్రల్ ఆల్కహాల్). ఆర్ఎస్ సింగిల్ ఫిల్టర్. ఈఎన్‌ఏ డబుల్ ఫిల్టర్. ఆర్ఎస్ స్పిరిట్ లీటర్ ధర రూ.48-50 ఉంది. ఈఎన్‌ఏ లీటర్ రూ.64-66 ఉంది. ఆర్ఎస్ స్పిరిట్‌తో లిక్కర్ తయారు చేస్తే తక్కువ ఖర్చవుతుంది. మన కంటే తక్కువ ధరకే మద్యం లభించే కొన్ని రాష్ట్రాల్లో ఆర్ఎస్ బేస్డ్ లిక్కర్ తయారవుతోంది. ఆర్ఎస్ బేస్డ్ కంటే ఈఎన్‌ఏ బేస్డ్ లిక్కర్ క్వాలిటీ మద్యం. దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాల్లో ఈఎన్‌ఏ బేస్డ్ లిక్కర్ తయారవుతోంది. కొన్ని ప్రాంతాల్లో తక్కువ ధరకు మద్యం లభ్యమైనా, ఆ మద్యంతో పోలిస్తే మన రాష్ట్రంలోని మద్యం క్వాలిటీగా ఉండేది. మన రాష్ట్రంలో ఉయ్యూరు, తణుకులో ఆర్ఎస్ స్పిరిట్ లభ్యమవుతోంది. నంద్యాలలో కూడా కొద్ది మేర ఆర్ఎస్ స్పిరిట్‌తో తయారు చేస్తున్నారు. తక్కిన అన్ని చోట్ల ఈఎన్‌ఏ బేస్డ్‌గానే లిక్కర్ తయారవుతోంది. అయితే ఇప్పుడు ఆర్ఎస్ బేస్డ్‌గానే 'చీప్ లిక్కర్' తయారీ చేయాలనే యోచనలో డిస్టిలరీలు ఉన్నట్లు తెలుస్తోంది. రూ.99కే చీప్ లిక్కర్ క్వార్టర్ అందించాలంటే తక్కువ ధరకు దొరికే ఆర్ఎస్ స్పిరిట్‌నే వినియోగించాలని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఆర్ఎస్ బేస్డ్ లిక్కర్ ధరలను కూడా ఎక్సైజ్‌శాఖ సమీక్షలో చర్చించినట్లు ఎక్సైజ్ వర్గాలు తెలిపాయి. తక్కువ ధరకు మద్యం విక్రయించే మూడు రాష్ట్రాల్లో 90 ఎంఎల్ డిప్ రూ.45, క్వాటర్ రూ.90కి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ తరహా మద్యాన్నే ఇక్కడ తయారు చేసేందుకు అనుమతులు ఇచ్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. 2014-19లో టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా తక్కువ ధరకు మద్యాన్ని విక్రయించారు. రాయలసీమలో తయారయ్యే ఓ కంపెనీ మద్యాన్ని క్వాటర్ రూ.40కే విక్రయించారు. ఈ మద్యాన్ని సేవించి చాలామంది కూలీలు, పేదలు అప్పట్లో అనారోగ్యం బారిన పడ్డారు.

చీప్ లిక్కర్ తయారీ తక్కువగా ఉండేలా మరో ఆలోచన

రాష్ట్రంలో నెలకు 30-35లక్షల కేసుల మద్యం విక్రయం అవుతుంది. ఇందులో 3-4లక్షల కేసులు మాత్రమే చీప్‌లిక్కర్ సరఫరా చేసి, తక్కిన అన్ని కేసుల ధరలు ఎక్కువ ఉన్న ఇతర బ్రాండ్ల మద్యాన్ని విక్రయించాలనే యోచనలో కూడా ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అప్పుడు రూ.99కే లిక్కర్ ఇచ్చినట్లుగా ప్రచారం చేసుకుంటూనే, అధిక ధరలు ఉన్న మద్యాన్ని ఎక్కువగా విక్రయించుకునే అవకాశం ఉంది.

తమ్ముళ్లకు మేలు చేసేలా సిండికేట్

- కొత్త మద్యం పాలసీలో దుకాణాలన్నీ టీడీపీ నేతలు దక్కించుకోవాలని ఆ పార్టీ పెద్దలు ఆయా జిల్లాల్లో మద్యం వ్యాపారాలపై అవగాహన ఉన్న నేతలకు సూచించినట్లు తెలుస్తోంది.
- దీంతో ఎక్కడికక్కడ 'సిండికేట్'గా ఏర్పడి దుకాణాలు దక్కించుకునే పనిలో టీడీపీ నేతలు నిమగ్నమయ్యారు.
- 'సిండికేట్'లో కొందరు బీజేపీ, జనసేన నేతలను కూడా కలుపుకుంటున్నారు.
- దుకాణం దక్కించుకున్న తర్వాత ఎమ్మార్పీపై రూ.20-30 ఎక్కువ ధరకు విక్రయించేందుకు సిద్ధమయ్యారు.
- 'సిండికేట్'ను కాదని ఎవరైనా దరఖాస్తులు చేసుకుని షాపులు దక్కించుకుంటే నడపలేరని, నిబంధనల పేరుతో ఇబ్బందులు పెడతామని 'సిండికేట్' ముందే భయపెడుతోంది.
- దీంతో దుకాణాలు 'కూటమి నేతలే' దక్కించుకునే అవకాశం ఉంది. ఆపై ధరలు వయోలేషన్ చేసి భారీగా ఆర్జించనున్నారు.
- సిండికేట్‌లో వీలైనంత ఎక్కువ మందిని కలుపుకుని ఒక్కొక్కరికి కనీసం నెలకు రూ.50వేల నుంచి రూ.లక్ష ఆదాయం వచ్చేలా చూడాలని టీడీపీ అధిష్టానం నుంచి సూచనలు వచ్చినట్లు తెలుస్తోంది.
- ఎక్సైజ్ అధికారులకు కూడా ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి.
- తొలివిడతలో 24 నెలల పాటు దుకాణాలు నడవనున్నాయి. ఈ కాలంలో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు భారీగా ఆర్జించనున్నారు.
- కూటమి నేతలకు ఆర్థికంగా ప్రయోజనం కల్గించేందుకు మద్యం ధరలు పెంచి మందుబాబుల జేబులు కొల్లగొట్టే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

- కలెక్టర్ రంజిత్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, చిత్రంలో ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ రంజిత్‌బాషా తెలిపారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఆయన జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌తో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగులదిన్నె, పంచలింగాల సమీపంలోని తుంగభద్ర నుంచి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పోలీసు సిబ్బందితో పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజూ ఆన్‌లైన్‌లో 6 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను మాత్రమే బుక్ చేసుకోవడానికి వీలు ఉందని కలెక్టర్ తెలిపారు. స్థానికంగా ఉన్న ఇసుక వనరులను పంచాయతీ సెక్రటరీ అనుమతితో వాడుకోవచ్చని సూచించారు. జిల్లాలో ఇసుక నిల్వలు తగ్గిపోతుండడంతో మరళి-1, మరళి-2, గుడికంబాలి, నదిచాగిలో ఓపెన్ రీచ్‌లను గుర్తించామన్నారు. ఇందులో మరళి-2, గుడికంబాలి, నది చాగి రీచ్‌లను 2025 మార్చి నుంచి అందుబాటులోకి తెస్తామన్నారు. పర్యావరణ అనుమతులు రావాల్సి ఉందని చెప్పారు. మరళి-1లో మాత్రం అక్టోబర్ 16వ తేదీ నుంచి రోజుకు 750 మెట్రిక్ టన్నుల ఇసుక సామర్థ్యంతో అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు.

బన్ని ఉత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

ప్రశాంత వాతావరణంలో దేవరగట్టు బన్ని ఉత్సవాన్ని నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ రంజిత్‌బాషా తెలిపారు. ఇప్పటికే ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. రక్తపాతానికి తావులేకుండా మాళ మల్లేశ్వరస్వామి ఉత్సవాలను జరుపుకోవాలని నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామాల ప్రజలకు సూచించామన్నారు. సంప్రదాయం ప్రకారం బన్ని ఉత్సవాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పటిష్ట బందోబస్తు మధ్య ఉత్సవాల నిర్వహణకు సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు 6 డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు.

సమష్టిగా పనిచేద్దాం.. ప్రజలకు అండగా నిలుద్దాం



సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లతో చర్చిస్తున్న వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య

- వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల సమావేశంలో ఎస్వీ, కాటసాని, మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): 'గత మూడున్నరేళ్లు నగరాభివృద్ధిలో కీలకంగా పనిచేశాం. మరో ఏడాదిన్నర అదే పంథా కొనసాగిస్తూ సమష్టిగా పని చేస్తూ ప్రజలకు అండగా నిలుద్దాం' అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ బీవై రామయ్య పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ హాలులో కోడుమూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, స్టాండింగ్ కమిటీ సభ్యులు విక్రమసింహారెడ్డి, జుబేర్, యూనుస్‌బాషా, క్రాంతికుమార్, కార్పొరేటర్లతో నగరంలోని వివిధ సమస్యలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా ఎస్వీ, కాటసాని, బీవై రామయ్య మాట్లాడుతూ నగరపాలక సంస్థ ప్రజలు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను మెజార్టీ స్థాయిలో గెలిపించారని, అదే నమ్మకంతో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. గత ప్రభుత్వ హయాంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' పేరుతో అన్ని వార్డుల్లో పర్యటించి స్థానికంగా ప్రజల సమస్యలు తెలుసుకున్నామన్నారు. వాటిని సచివాలయాల వారీగా పరిష్కరించామన్నారు. త్వరలో నిర్వహించనున్న సర్వసభ్య సమావేశంలో సమష్టిగా సమస్యలు పరిష్కరించుకునేందుకు కలిసికట్టుగా పని చేద్దామని పిలుపు నిచ్చారు. అలాగే గత ప్రభుత్వం టెండర్లు పిలిచి అగ్రిమెంటు చేసుకున్న అభివృద్ధి పనులను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయాలని చూస్తోందన్నారు. వాటిని దీటుగా నిలదీద్దామన్నారు. నగరంలో వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉన్నా నియంత్రణ చేయడంలో జాప్యం జరుగుతుందన్నారు. ఒకే రోజు 30 మంది పిల్లలు, పెద్దలు కుక్క కాటుకు గురికావడం బాధాకరమన్నారు. అటువంటి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుదామన్నారు.

కైలాస వాహనంపై ఆదిదంపతుల విహారం



స్వామి అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

- కూష్మాండదుర్గ స్వరూపంలో భక్తులకు సాక్షాత్కరించిన శ్రీశైల భ్రామరీ
- శోభాయమానంగా కొనసాగుతున్న దసరా నవరాత్రోత్సవాలు



స్వామిఅమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: దసరా మహోత్సవాల్లో భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లు కైలాస వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అష్టాదశ శక్తిపీఠమైన శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు శోభాయమానంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీశైల భ్రమరాంబాదేవి కూష్మాండదుర్గ అమ్మవారి స్వరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నవదుర్గ అలంకారాల్లో భాగంగా భ్రమరాంబాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని కూష్మాండదుర్గ స్వరూపంలో అలంకరించారు. ఈ దేవిని ఆరాధించడం వల రోగాలన్నీ నివారించబడి, ఆరోగ్యం చేకూరుతుంది. ఆయువు, యశస్సు వృద్ధి చెందుతాయని భక్తుల నమ్మకం. ప్రత్యేకంగా కూష్మాండదుర్గగా అలంకరించిన అమ్మవారి ఉత్సవమూర్తిని ఆలయం ముందు ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై కొలువుంచి ఆలయ అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజాదికాలను నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా కైలాస వాహనంపై అలంకీకృతులైన స్వామిఅమ్మవార్లను అలంకార మండపంలో ఉంచి అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వామిఅమ్మవార్లకు ఆలయ ఉత్సవం నిర్వహించి గ్రామోత్సవానికి తరలించారు. డప్పు, వాయిద్యాలు, కళాకారుల నృత్యాలతో గ్రామోత్సవం వైభవంగా సాగింది. గ్రామోత్సవంలో స్వామిఅమ్మవార్లను భక్తులు కనులారా దర్శించుకుని ప్రత్యేక నీరాజనాలు సమర్పించారు.

- మహోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీశైల భ్రమరాంబాదేవి స్కందమాత అలంకారంలో, స్వామి అమ్మవార్లు శేషవాహనంపై దర్శనమివ్వనున్నారు.

అభివృద్ధి పనులపై విజిలెన్స్ ఆరా

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలోని ఇంజినీరింగ్ విభాగంలో జరిగిన అభివృద్ధి పనులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ అధికారి కె.చౌడేశ్వరి ఆరా తీస్తున్నట్లు సమాచారం. 2021 నుంచి 2024 సంవత్సరం వరకు శ్రీశైల దేవస్థానంలో చేసిన అభివృద్ధి పనులపై వివరాలు ఇవ్వాలని ఈనెల 2న శ్రీశైల దేవస్థాన ఈఓకు లేఖ రాసినట్లు అధికారులు పేర్కొన్నారు. అభివృద్ధి పనుల నిర్వహణలో ఇంజినీరింగ్ అధికారులపై అక్రమాలు, అవినీతి ఆరోపణలు, దేవస్థానం నిధులు దుర్వినియోగం అయ్యాయని విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఆయా పనుల వివరాలు తెలియజేయాలని, గణేశ సదనం వద్ద మంజూరు చేసిన పనుల వివరాలు, రికార్డులు అందజేయాలని లేఖలో పేర్కొన్నట్లు సమాచారం.

హౌసింగ్ ఏఈ సస్పెన్షన్

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ హౌసింగ్ ఏఈ రమణారెడ్డిని సస్పెండ్ చేసినట్లు హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య ఆదివారం తెలిపారు. ఈనెల 1వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'ఇసుక నిల్వల్లో దొంగలు పడ్డారు!' కథనానికి స్పందించిన జిల్లా అధికారులు విచారణ కమిటీ వేశారు. కలెక్టర్ రాజకుమారికి కమిటీ నివేదిక అందజేయడంతో ఆమె ఆదేశాల మేరకు ఇసుక స్టాక్ పాయింట్ ఇన్‌చార్జ్‌గా ఉన్న ఏఈ రమణారెడ్డిని సస్పెండ్ చేసినట్లు పీడీ తెలిపారు.

నగరపాలక సర్వసభ్య సమావేశం వాయిదా..

కర్నూలు (టౌన్): ఈనెల 8వ తేదీన నిర్వహించాల్సిన నగరపాలక సర్వ సభ్య సమావేశం వాయిదా వేశారు. సమావేశానికి అధికారులు అందుబాటులో లేకపోవడంతో మరోసారి నిర్వహించేందుకు పాలకవర్గం నిర్ణయించింది. త్వరలోనే సమావేశ తేదీని ఖరారు చేయనున్నట్లు మేయర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ధర పతనం.. తీరని నష్టం

మిరప ధరలు రోజు రోజు పడిపోతుండటంతో రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను మార్కెట్‌కు తరలించి విక్రయిస్తే కనీసం కూలీల డబ్బులు కూడా చేతికందడం లేదు. చేసేది లేక రైతులు పంటను తొలగిస్తున్నారు. కోడుమూరు మండలంలోని ప్యాలకుర్తి గ్రామానికి చెందిన రైతు రఫీక్ ఈ ఏడాది సుమారు రూ.10 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టి పది ఎకరాల్లో మిర్చి సాగు చేశాడు. సరిగ్గా కోత సమయంలో మార్కెట్‌లో కిలో రూ. 10కి పడిపోవడంతో చేసేదిలేక రెండు రోజులుగా పంటను ట్రాక్టర్ రోటావేటర్‌తో తొలగించేశాడు. ఏటా ఏదో విధంగా వ్యవసాయంలో నష్టాలు వస్తున్నాయని రైతు రఫీక్ ఆవేదన వ్యక్తం చేశాడు.

– కోడుమూరు రూరల్



క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

ఆదోని సెంట్రల్: ఆదోని–ఇస్వి ఆర్‌ఎస్ మధ్య పట్టాలపై రైలు ఢీకొని వ్యక్తి మరణించాడు. వివరాలు.. ఆస్పరి గ్రామానికి చెందిన టి.చంద్రశేఖర్ (50) ఆదివారం ఆదోని – ఇస్వి ఆర్‌ఎస్ మధ్య డౌన్ లైన్ ట్రాక్ కిలోమీటరు నంబర్ 496/30–497/2 వద్ద రైల్వే ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు తెలిపారు. చంద్రశేఖర్‌కు మతి స్థిమితం సరిగా లేక చెవులు వినబడక పోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు వారు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

మహానంది: నంద్యాల–గిద్దలూరు రోడ్డులోని గాజులపల్లె గ్రామంలో ఉన్న ఏటీఎంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి యత్నించి విఫలమయ్యారు. ఇండియా –1 ఏటీఎం డోర్ ధ్వంసమై ఉండటాన్ని ఆదివారం ఉదయం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. డోర్‌ను ఇనుపరాడ్డుతో పగులగొట్టినట్లు, సీసీ కెమెరాల వైర్లు కట్ చేసినట్లు గుర్తించారు. ఏటీఎంను ధ్వంసం చేసినా డబ్బు తీసుకోలేకడానికి వీలుకాకపోవడంతో దుండగులు వెనుదిరిగి వెళ్లినట్లు తెలుస్తోంది. ఏటీఎం నిర్వాహకుడు బషీర్ అహమ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితుడు?

సి.బెళగల్: మండల పరిధిలో ఓ వ్యక్తి తన పొలంలో గంజాయి సాగు చేశాడన్న సమాచారం మేరకు దాడులు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు చర్చనీయాంశంగా మారింది. మండల కేంద్రానికి చేరువగా ఉన్న గ్రామంలో నిందితుడు తన మిరప పంటలో గంజాయి మొక్కలను సాగు చేశాడన్న సమాచారంతో ఆదివారం ఎస్‌ఐ తిమ్మారెడ్డి, తన సిబ్బందితో కలిసి పంటను పరిశీలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారిస్తున్నట్లు సమాచారం. సదరు గ్రామంలోనూ పలువురిని విచారించినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎస్‌ఐ సమాధానం దాటవేయడంతో, కోడుమూరు సీఐ తబ్రేజ్‌ను వివరణ కోరగా త్వరలో అన్ని విషయాలు వెల్లడిస్తామని చెప్పారు. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు నిందితుడికి మద్దతుగా నియోజకవర్గ నేతలకు చెప్పి, కేసును మాఫీ చేసేందుకు ప్రయత్నాలు చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి



మృతి చెందిన విద్యార్థి శ్రీధర్

శిరివెళ్ల: తోటి స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుకుంటూ బాల్ తీసుకునే క్రమంలో విద్యుదాఘాతానికి గురై ఓ విద్యార్థి మృతిచెందిన ఘటన యర్రగుంట్ల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మేడిదిన్నె రాము కుమారుడు శ్రీధర్ (15) స్థానిక గాయత్రి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. సెలవులు కావడంతో స్నేహితులతో కలిసి అదే పాఠశాల ఆవరణంలో క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. బాల్ రేకుల షెడ్‌పై పడటంతో తీసుకునేందుకు వెళ్లిన శ్రీధర్‌కు.. అప్పటికే తెగి పడిన విద్యుత్ తీగ వల్ల విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు విద్యార్థిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు.

మితిమీరిన జోక్యం

- మద్యం షాపులకు దరఖాస్తు చేయకుండా టీడీపీ నేతల బెదిరింపులు
- అనుచరులకే దుకాణాలు దక్కేలా పన్నాగం
- జిల్లాలో 99 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్
- ఇంకా 39 షాపులకు దరఖాస్తులు నిల్
- 9వ తేదీ వరకు గడువు
- 11న లాటరీ ద్వారా షాపుల కేటాయింపు
- 12 నుంచి అందుబాటులోకి కొత్త దుకాణాలు



కర్నూలు: మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటలకు ముగుస్తుంది. దరఖాస్తుల స్వీకరణకు మరో 3 రోజులు మాత్రమే గడువు ఉంది. కర్నూలు జిల్లాలో 99 దుకాణాలకు నోటిఫికేషన్ జారీ కాగా ఇప్పటివరకు 39 దుకాణాలకు దరఖాస్తుల బోణీ కాలేదు. రెండేళ్ల కాల పరిమితితో నూతన మద్యం విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ ఏడాది అక్టోబర్ 12 నుంచి 2026 సెప్టెంబర్ 30వ తేదీ వరకు నూతన విధానం అమలులో ఉంటుంది. మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈనెల 1వ తేదీ నుంచే ప్రారంభమైంది. మూడు విధానాల్లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించారు. అయితే ఎంతమంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నది గందరగోళంగా మారింది. ఈనెల 11న లాటరీ ద్వారా దుకాణాలను కేటాయించి 12వ తేదీ నుంచి కొత్త దుకాణాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు జిల్లా ఎక్సైజ్ అధికారులు శ్రమిస్తున్నారు. అయితే ఆశావహుల నుంచి స్పందన ఉన్నప్పటికీ అధికార పార్టీ నాయకుల జోక్యం, చర్చల నేపథ్యంలో ప్రక్రియ మందకొడిగా సాగుతోంది.

నేతల బెదిరింపులే కారణం

అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు తమ అనుచరులకే దుకాణాలు దక్కించుకునేందుకు ఆశావహులను బెదిరిస్తుండటం వల్లే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మందకొడిగా సాగుతోందని ఆశావహుల్లో చర్చ జరుగుతోంది. కర్నూలు నగరంలో మాజీ మంత్రి సోదరుని కనుసన్నల్లోనే దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుండగా పాణ్యం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో ఆయా నియోజకవర్గాల ముఖ్య నేతల జోక్యంతో ఆశావహులు ముందుకు రావడం లేదన్న చర్చకు దారి తీసింది. ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, ఆత్మకూరు, నంద్యాల, బనగానపల్లె, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో కూడా ప్రజాప్రతినిధుల జోక్యం మితిమీరిందన్న విమర్శలు ఆశావహుల నుంచి వినిపిస్తున్నాయి. మాకు తెలియకుండా దరఖాస్తులు చేసి దుకాణాలు దక్కించుకుంటే వ్యాపారం చేసుకోలేరు.. దుకాణాల ఏర్పాటుకు అద్దె గదులు దొరక్కుండా చేస్తాం.. బెల్టు షాపుల ద్వారా వ్యాపారాలు చేసుకోకుండా ఎక్సైజ్, సివిల్ పోలీసులతో దాడులు చేయించి నష్టపరుస్తాం .. ఆ తర్వాత మీ ఇష్టం.. అంటూ ఆయా నియోజకవర్గాల ముఖ్య నేతల అనుచరులు ఆశావహులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ప్రజాప్రతినిధులు కొందరు ఎక్సైజ్ అధికారులకు కూడా ఫోన్లు చేసి ఆశావహులను కట్టడి చేయాలని ఆదేశిస్తున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన బదిలీల్లో మీరు కోరిన స్థానాలకు నియమించాం. వ్యాపార లావాదేవీల్లో సహకరిస్తారన్న ఉద్దేశంతోనే మిమ్మల్ని స్టేషన్లకు నియమించేలా ఏర్పాట్లు చేశాం. కాబట్టి ఆశావహులను కట్టడి చేయండి.. అని ఆదేశిస్తున్నట్లు తెలుస్తోంది.

39 మద్యం దుకాణాలకు బోణీ కాలేదు

మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఐదు రోజులుగా కొనసాగుతున్నప్పటికీ కర్నూలు జిల్లాలో ఇంకా 39 దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. జిల్లాలో మొత్తం 99 దుకాణాలు ఉండగా 60 దుకాణాలకు 128 దరఖాస్తులు మాత్రమే ఆఫ్‌లైన్‌లో సమర్పించారు.

> **దరఖాస్తుల సమర్పణను ప్రోత్సహించండి**
>
> 
>
> మద్యం షాపుల నిర్వహణపై ఆసక్తి కలిగిన వ్యక్తులు దరఖాస్తులు సమర్పించేలా ప్రోత్సహించాలి. అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని అనుసరించి లేదా జిల్లాలోని ఏడు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా దరఖాస్తుల సమర్పణ పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని వ్యాపారులకు కర్నూలు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు విజ్ఞప్తి చేశారు.
>
> – మచ్చ సుధీర్‌బాబు, ఈఎస్, కర్నూలు

ధైర్యంగా దరఖాస్తు చేసుకోవచ్చు



మాట్లాడుతున్న నంద్యాల జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి ఎస్.రవికుమార్

నందికొట్కూరు: మద్యం దుకాణాలకు ధైర్యంగా దరఖాస్తులు చేసుకోవచ్చని నంద్యాల జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి ఎస్.రవికుమార్ స్పష్టం చేశారు. ఆదివారం పట్టణంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 105 మద్యం దుకాణాలు ఏర్పాటు చేసేందుకు నోటిఫికేషన్ వెలువడిందని చెప్పారు. గతంలో ఒకరు ఒక దుకాణానికి మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేదని, ప్రస్తుతం ఒకరు ఎన్ని మద్యం దుకాణాలకైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇప్పటివరకు మద్యం దుకాణాలకు 220 దరఖాస్తులు వచ్చినట్లు స్పష్టం చేశారు. లాటరీ సమయంలో దరఖాస్తుదారుడి తరపున ఆథరైజ్‌గా ఎవరినైనా పంపుకోవచ్చని చెప్పా రు. ఏడాదికి నిర్దేశిత ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎవరి ఒత్తిళ్లకు లొంగకుండా, భయపడకుండా దరఖాస్తు చేసుకోవాలని, సమస్య ఉంటే 80088 28467 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు, ఎస్‌ఐ జఫ్రుల్లా ఉన్నారు.

మల్లన్న సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



ఏపీ హైకోర్టు న్యాయమూర్తి దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆదివారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప్ దంపతులకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి దంపతులు మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద ఆశీర్వచన మండపంలో న్యాయమూర్తి దంపతులకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

హత్య కేసు నిందితుల అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న దృశ్యం

డోన్ టౌన్: ఓ యువకుడి హత్య కేసు నిందితులను పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల వివరాలను పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా విలేకరులకు వెల్లడించారు. కొండపేటకు చెందిన మదార్‌వలిపై గత నెల సెప్టెంబరు 17న అదే కాలనీకి చెందిన బెస్త హరికృష్ణ, బెస్త చెన్నకేశవులు, బెస్త రంగముని, దూదేకుల మౌలాలి అలియాస్ పొట్టి మౌలాలి, చాకలి శివసాయి అలియాస్ సాయి కర్రలు, రాడ్లతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన మదార్‌వలి కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక సెప్టెంబరు 26న మృతి చెందాడు. పోలీసులు దాడి కేసును హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వ్యవసాయ మార్కెట్‌యార్డు సమీపంలో ఉన్న ఐదుగురు నిందితులను ఆదివారం అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు దేశించినట్లు సీఐ తెలిపారు.



ప్రత్యేకాలంకరణలో గ్రామ దేవత మంచాలమ్మ

విశిష్టాలంకారణలో మంచాలమ్మ

మంత్రాలయం: మంత్రాలయం గ్రామ దేవత మంచాలమ్మ మట్టి గాజుల అలంకరణలో దర్శనమిచ్చారు. శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి మూలవిరాట్‌ను వివిధ రకాల మట్టి గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. మంచాలమ్మ దర్శనార్థం భక్తులు, గ్రామస్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు.

జోగులాంబకు పట్టు వస్త్రాల సమర్పణ



స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, కుటుంబసభ్యులు

కర్నూలు(సెంట్రల్): అలంపూర్ క్షేత్రంలో వెలసిన జోగులాంబా సమేత బాలబ్రహ్మేశ్వరస్వామికి జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా కుటుంబ సభ్యులతో కలిసి పట్టువస్త్రాలు సమర్పించారు. దసరా శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించడం సంప్రాదాయం. అందులో భాగంగా ఆదివారం జిల్లా కలెక్టర్ కుటుంబ సమేతంగా స్వామి అమ్మవార్లను దర్శించుకొని పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమలను సమర్పించారు. అంతకముందు కలెక్టర్‌కు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద పండితులు వేదాశీర్వచనంతో తీర్థప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అందజేశారు. సంప్రదాయాన్ని గౌరవించి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించడం సంతోషంగా ఉందని, తన అమ్మమ్మ ఊరు అలంపూర్ అని, చిన్నతనంలో ఆలయ పరిసరాల్లో స్నేహితులతో ఆడుకునే వాళ్లమని, తనకు గుడికి అనుబంధం ఉందని కలెక్టర్ గుర్తుచేసుకున్నారు. ఆలయ చైర్మన్ కొంకల నాగేశ్వరరెడ్డి, కర్నూలు దేవదాయ శాఖ ఏసీ బి.సుధాకరరెడ్డి, ఆలయ ఈఓ పురేంద్రకుమార్ ఉన్నారు.

వ్యాఘ్రవాహనంపై కూష్మాండ దుర్గ



వ్యాఘ్రవాహనంపై మహానందిలో గ్రామోత్సవం

మహానంది: స్థానిక ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు ఆదివారం కామేశ్వరీదేవి అమ్మవారు కూష్మాండదుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, పండితులు అలంకార మండపంలో అమ్మవారికి సహస్రదీపాలంకరణ పూజలు నిర్వహించారు. రాత్రి కూష్మాండ దుర్గ అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి వ్యాఘ్ర(పులి)వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

అరుదైన గ్రంథం 'రవ్వల సడి'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ సాహిత్యంలో ఆధునిక కవిత్వ నడకలను చెబుతూ పరిశోధనాత్మకంగా సాగిన అరుదైన గ్రంథం 'రవ్వల సడి' అని ప్రముఖ కవయిత్రి డాక్టర్ కె.సుభాషిణి పేర్కొన్నారు. ప్రముఖ కవి వెంకట కృష్ణ రచించిన రాయలసీమ కవుల కవిత్వ వ్యాసాల సంకలనం 'రవ్వల సడి' ఆవిష్కరణ సభ ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ గ్రంథం పరిశోధకులకు అరుదైనదని, అకడమిక్‌గా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, డాక్టర్ అంకె శ్రీనివాస్ మాట్లాడారు. సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్, కవి సమ్మేళనం ప్రచురణ కర్త కొత్తపల్లి సురేష్, కవులు చౌశా, మారుతీ, ఇనాయతుల్లా, పార్వతయ్య, ఏవీ రెడ్డి, రాంసుబ్బారెడ్డి, సీఐ శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తండ్రీకొడుకులపై దాడి



చిరిగిన దుస్తులతో స్టేషన్ వద్ద లక్ష్మన్నగౌడ్, కురుమయ్య గౌడ్

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని తూర్పు ప్రాతకోట గ్రామంలో ఆదివారం తండ్రీకొడుకులపై అదే గ్రామానికి చెందిన కొందరు దాడికి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఈడిగ లక్ష్మన్నగౌడ్ 2006లో ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఆ సమయంలో పక్కనే ఉన్న ఎల్లగౌడ్ ఇంటి గోడపై పారు కట్టుకోవడానికి పెద్దల సమక్షంలో ఖరీదు నిర్ణయించి రూ.1,000 చెల్లించాడు. ప్రస్తుతం ఎల్లగౌడ్ కూడా తన ఇంటిని పడగొట్టి పునర్నిర్మాణం చేపట్టాలని నిర్ణయించుకుని జాయింట్ పారును తీసివేస్తానని లక్ష్మన్నగౌడ్‌కు తెలిపాడు. పారు తీసివేస్తే ప్రస్తుత రేట్ల ప్రకారం జాయింట్ పారుకు కేటాయించిన 14 అడుగుల స్థలానికి డబ్బు చెల్లించాలని అతడు కోరగా ఎల్లగౌడ్ నిరాకరించాడు. తనకు 2006లో ఇచ్చిన రూ.1,000 మాత్రమే తిరిగి ఇస్తానని తెగేసి చెప్పాడు. ఈ వివాదం మూడు నెలల నుంచి సాగుతోంది. కాగా గ్రామ పెద్ద విజయ్‌మోహన్‌రెడ్డి వద్ద సమస్యను పరిష్కరించుకుందామని ఉదయం పిలిచి మహేష్‌గౌడ్, శంకర్‌గౌడ్, ఎల్లగౌడ్, మల్లికార్జునగౌడ్, రంగమ్మ మూకుమ్మడిగా తమపై దాడికి పాల్పడినట్లు లక్ష్మన్నగౌడ్, అతని కుమారుడు కురుమయ్య గౌడ్ పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. ఇదే విషయమై ఎస్‌ఐ సి.శరత్‌కుమార్‌రెడ్డిని ఆరా తీయగా నిర్ధారించేందుకు నిరాకరించడం గమనార్హం.

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని కిమ్స్–బొల్లినేని కళాశాలలో డిప్లొమా పారా మెడికల్ కోర్సులకు ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్. నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో ఈ ఏడాది నుంచి ఏపీ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ అనుమతితో 8 డిప్లొమా పారా మెడికల్ కోర్సులు ప్రారంభిస్తున్నామన్నారు. ఇందులో డీఎంఎల్‌టీ–25, డీఎంఐటీ–25, డీఎంఎస్‌టీ–25, డీఏఎన్ఎస్–25, డీ కార్డియాక్–25, కేథలాబ్ టెక్నీషియన్–25, డయాలసిస్ టెక్నీషియన్–20, పెర్‌ఫ్యూజన్ టెక్నీషియన్ కోర్సుల్లో 10 సీట్లు ఉన్నాయన్నారు. కన్వీనర్ కోటాలో చేరిన విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉందన్నారు. కోర్సులు పూర్తి చేసిన వారికి వివిధ కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. వివరాలకు 7680945357, 7995013422ను సంప్రదించాలన్నారు.

చిన్నా.. లెయ్యిరా!

- వేరుశనగ విత్తనాలు గొంతులో అడ్డుపడి బాలుడి మృతి



మృతి చెందిన హర్షవర్ధన్

కోడుమూరు రూరల్: బుడి బుడి అడుగులేస్తూ నడుస్తుంటే మురిసిపోయారు. ముద్దు ముద్దు మాటలు చెబుతూ మారం చేస్తుంటే సంతోషించారు ఆ తల్లి దండ్రులు. అయితే విధికి వారి ప్రేమను చూసి కన్ను కుట్టింది. అభం శుభం తెలియని చిన్నారి బాబును మృత్యువు రూపాన వచ్చి తిరిగిరాని లోకాలకు తీసుకెళ్లింది. వివరాలు.. కోడుమూరులోని కోటవీధికి చెందిన ధనుంజయ, విజయలక్ష్మి దంపతులకు ఆరేళ్లలోపు వయసున్న ముగ్గురు కుమారులు సంతానం ఉన్నారు. చిన్నవాడైన 15 నెలల బాలుడు హర్షవర్ధన్ శుక్రవారం ఇంట్లో ఆడుకుంటూ వేరుశనగ విత్తనాలను మింగేశాడు. తీవ్ర అస్వస్థతకు గురై ఊపిరి పీల్చుకునేందుకు ఇబ్బంది పడుతుండగా గమనించిన తల్లిదండ్రులు హుటాహుటిన కోడుమూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించి అక్కడి నుంచి కర్నూలుకు తరలించారు. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించగా కొంతమేర కోలుకున్నాడు. అయితే శనివారం రాత్రి మరోసారి ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది ఏర్పడి ఆస్పత్రిలోనే మృతిచెందాడు. వైద్యానికి రూ.లక్షకు పైగా ఖర్చు పెట్టినా కుమారుడు దక్కకపోవడంతో ఆ పేద తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



అనంతపురం- కర్నూలు జిల్లాల బాలికల జట్ల మధ్య జరుగుతున్న షూటింగ్ బాల్ పోటీ

క్రీడలతో మానసిక ఉల్లాసం

- గురుకులాల జిల్లా కో ఆర్డినేటర్ శ్రీదేవి
- అంతర్‌జిల్లాల జూనియర్ షూటింగ్ బాల్ పోటీలు ప్రారంభం



షూటింగ్ బాల్ పోటీలను ప్రారంభిస్తున్న డీసీఓ శ్రీదేవి

సి.బెళగల్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని గురుకులాల కర్నూలు జిల్లా కో ఆర్డినేటర్ (డీసీఓ) శ్రీదేవి అన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల జూనియర్ షూటింగ్ బాల్ పోటీలను ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరితో కలిసి ఆమె ప్రారంభించారు. 18 జిల్లాకు చెందిన 450 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారిని ఉద్దేశించి డీసీఓ మాట్లాడుతూ క్రీడల్లో రాణించేవారికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. భవిష్యత్‌లో అవకాశం వస్తే మరిన్ని క్రీడా పోటీలను గురుకుల పాఠశాలల ప్రాంగణాలలోనే నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం మొదటి రోజు కొన్ని జిల్లాల జట్ల మధ్య పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, న్యాయవాది శ్రీధర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ బాలరాముడు, పీడీ రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోసం ఎండలో ఎదురు చూపులు



ఎమ్మెల్యే కోసం ఎండలో ఎదురుచూస్తున్న క్రీడాకారులు

పోటీలను ప్రారంభించేందుకు నియోజకవర్గ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి వస్తారని క్రీడా కారులను నిర్వాహకులు ఎండలో కూర్చోబెట్టారు. ఎమ్మెల్యే వచ్చే ముందు లైన్‌షామ్ చేద్దామని కొంతమంది స్థానిక నేతలు చెప్పినా నిర్వాహకులు వినిపించుకోకుండా మధ్యాహ్నం 12 గంటల సమయంలో దాదాపు అరగంట సేపు ఎండలో పడిగాపులు కాయించారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

సాఫ్ట్ బాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

నంద్యాల (న్యూ టౌన్): జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన క్రీడలకు దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాల క్రీడాకారులు హాజరయ్యారు. జాతీయ జెండా, క్రీడా పతాకాలను అతిథులు ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో గురు రాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్ చైర్మన్ డాక్టర్ పి.దస్తగిరి రెడ్డి, రామకృష్ణ కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఐక్య ఉపాధ్యాయ సంఘాల నాయకుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ సెక్రెటరీ మౌర్య, ఆంధ్రప్రదేశ్ సెక్రటరీ నాగేంద్ర, కర్నూలు జిల్లా సెక్రెటరీ విజయకుమార్‌తోపాటు గురు రాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ పి.షేక్షావల్లిరెడ్డి, డాక్టర్ రవికృష్ణ పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల ఆటో బోల్తా



బనగానపల్లె రూరల్: మండలంలోని యనకండ్ల గ్రామ సమీపంలో ఆదివారం గ్యాస్ సిలిండర్ల ఆటో బోల్తా పడింది. బేతంచెర్ల నుంచి హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లతో ట్రాలీ ఆటో బనగానపలెకు బయలుదేరింది. యనకండ్ల గ్రామ సమీపంలో ముందు టైర్ పేలడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, డెలివరీ బాయ్ క్షేమంగా బయటపడ్డారు.